మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్

బోనస్ డబ్బులు త్వరగా అందేలా చూడాలి

ఆమనగల్లు, జనవరి 18 : కొనుగోలు కేంద్రాల్లో సన్నరకం వరి ధాన్యం విక్రయించిన రైతులకు ప్రభుత్వం ప్రకటించిన రూ.500 బోనస్, వరి ధాన్యం డబ్బులు త్వరగా అందేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డిని డీసీసీబీ డైరెక్టర్, ఆమనగల్లు సింగిల్ విండో చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్తా కోరారు. శనివారం హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. బీఆర్ఎస్ పార్టీ తరపున ఒత్తిడి తెస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు వెంకటేశ్ తెలిపారు.

రావిచేడ్‌లో సర్వేను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నర్సింహారావు

రైతు భరోసా సర్వే పకడ్బందీగా చేపట్టాలి

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నర్సింహారావు

కడ్తాల్, జనవరి 18 : రైతు భరోసా పథకాన్ని అమలు చేసేందుకు గ్రామాల్లో అధికారులు చేపట్టిన భూ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నర్సింహారావు అన్నారు. శనివారం మండల పరిధిలోని రావిచేడ్ గ్రామంలో అధికారులు చేపట్టిన సాగుకు యోగ్యం కాని భూముల వివరాలను గుర్తించే ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పంటలు సాగయ్యే ప్రతి ఎకరాకు రైతు భరోసా ఇవ్వాలనదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. గ్రామాల్లో సాగుకు యోగ్యంకాని భూములను గుర్తిస్తున్నట్లు పేర్కొన్నారు. సాగు భూములను, వ్యవసాయేతర భూములను గుర్తించి నివేదికలు తయారు చేస్తున్నామన్నారు. గ్రామాల్లో జనవరి 21 నుంచి నిర్వహించే గ్రామ సభల్లో సర్వే వివరాలను చదివి వినిపించడంతోపాటు జాబితాను ప్రచురిస్తామని వివరించారు. కార్యక్రమంలో ఏడీఏ ఆదిలక్ష్మి, తహసీల్దార్ ముంతాజ్, వ్యవసాయ శాఖ మండల అధికారి శ్రీలత, ఏఈవోలు వందన, అనూష, అభినవ్‌రెడ్డి, రమేశ్, ఆర్ఐ వాహిద్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న రోడ్డు భద్రతా మాసోత్సవాలు

జిల్లా రవాణా శాఖ అధికారి వెంకట్‌రెడ్డి

రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న రవాణా శాఖ అధికారులు, సిబ్బంది

వికారాబాద్, జనవరి 18 : రోడ్డు నిబంధనలు పాటించి ప్రమాదాల బారిన పడకుండా చూసుకోవాలని జిల్లా రవాణా శాఖ అధికారి వెంకట్‌రెడ్డి తెలిపారు. శనివారం వికారాబాద్‌లోని భాను డ్రైవింగ్ స్కూల్ వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనవరి 1 నుంచి 31 వరకు జరుగుతున్న మాసోత్సవాల్లో భాగంగా వివిధ కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లావ్యాప్తంగా వాహన చోదకులకు రోడ్డు భద్రతా నియమాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రమాదాలను అరికట్టాలంటే వాహనచోదకులు, ప్రయాణికులు, ప్రజలందరూ రోడ్డు భద్రతపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. టూ వీలర్స్ ప్రయాణికులు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలని, కార్లలో సీట్ బెల్ట్ ను విధిగా పెట్టుకోవాలన్నారు. మద్యం తాగి, ఫోన్ మాట్లాడుతూ, ఇతర ప్యాసింజర్లతో మాట్లాడుతూ, మ్యూజిక్ వంటివి ఆపరేట్ చేస్తూ డ్రైవింగ్ చేయడం వలన దృష్టి మరలి ప్రమాదానికి గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. మితిమీరిన వేగంతో వాహనాలను నడపరాదని ఆయన సూచించారు. కార్యక్రమాల్లో ఎంవీఐలు జోసఫ్ హాల్ట్, వీరేంద్ర నాయక్, ఏఎంవీఐలు కిశోర్, శ్రీలక్ష్మి, వరుణ్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ వెంకట్‌యాదవ్, కానిస్టేబుల్స్ రాఘవేంద్ర, ప్రియాంకగౌడ్, లత, జాషువా, శ్రీను, రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్‌రెడ్డి

జిల్లా న్యాయసేవా సంస్థ ఆధ్వర్యంలో

ఓరియంటేషన్ శిక్షణ

వికారాబాద్, జనవరి 18 : వికారాబాద్ జిల్లా న్యాయసేవా సంస్థ ఆధ్వర్యంలో రెండు రోజుల ఒరియంటేషన్ శిక్షణా కార్యక్రమాన్ని శనివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవా చైర్మన్ డా.సున్నం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. వికారాబాద్ జిల్లాలోని పారా లీగల్ వలంటీర్లు, న్యాయ విద్యార్థులు, న్యాయ సేవా ప్యానల్ న్యాయవాదులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో సమాజంలో పిల్లలపై జరుగుతున్న ఆఘాయిత్యాలు వాటి నివారణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే ఆత్మహత్యలు చేసుకునేందుకు గల కారణాలపై కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవా సెక్రటరీ, న్యాయమూర్తి డీబీ షీతల్, జిల్లా అదనపు న్యాయమూర్తి చంద్రకిశోర్, ప్రిన్సిపల్ జూనియర్ న్యాయమూర్తి శ్రీకాంత్, అదనపు జూనియర్ న్యాయమూర్తి శృతి దూత, లీగల్ హెడ్ న్యాయవాదులు వెంకటేశ్, రాము, శ్రీనివాస్, న్యాయవాదులు బాలయ్య, నాగరాజు, నర్సింహులు, యాదగిరి, పారా లీగల్ వలంటీర్లు ఉన్నారు.

అభ్యంతరాలుంటే తెలియజేయండి

మల్టీ పర్పస్ ఇండస్ట్రియల్ పార్కు కోసం రైతులతో చర్చించిన వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్/కొడంగల్, జనవరి 18 : మల్టీ పర్పస్ ఇండస్ట్రియల్ పార్క్ కోసం అసైన్డ్ భూములకు సంబంధించి దుద్యాల మండలం పోలేపల్లి గ్రామ రైతులతో వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ శనివారం జిల్లా కలెక్టరేట్‌లో చర్చలు నిర్వహించారు. ఫారమ్-సి నోటిఫికేషన్ 29 నవంబర్, 2024న 60 రోజుల పాటు అంటే 27-01-2025 వరకు సమ్మతి అవార్డు కోసం జారీ చేయబడిందన్నారు. పేర్కొన్న వ్యవధిలో భూసేకరణలో ఏవైనా అభ్యంతరాలు, తదితర అంశాలపై సమావేశంలో కూలంకుశంగా చర్చించారు. 34 మంది రైతులు హాజరయ్యారు. దుద్యాల్ మండలం పోలేపల్లి గ్రామంలో మొత్తం 73.39 ఎకరాల భూమి ఉందని.. దీనిపై రైతులతో చర్చ నిర్వహించి రైతుల సమ్మతాన్ని పొందినట్లు కలెక్టర్ తెలిపారు. సమ్మతి అవార్డు పొందిన రైతులకు ఎకరానికి రూ.20 లక్షలు, 150 గజాల ఇంటి స్థలంలో ఇందిరమ్మ ఇల్లు, ఇంటికి ఒక ఉద్యోగం కల్పించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ లింగ్యా నాయక్, తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ ట్రైనీ ఉమాహారతి, టీజీఐసీ జోనల్ మేనేజర్ శైలజ, అసిస్టెంట్ జోనల్ మేనేజర్ అజీమాసుల్తానా, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రామ్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రీధర్‌రెడ్డి, దుద్యాల తహసీల్దార్ కిషన్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే జేపీ దర్గా అభివృద్ధి

దర్గాలో ప్రార్థనలు చేస్తున్న మాజీ డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

మాజీ డిప్యూటీ సీఎం మహమూద్ అలీ

కొత్తూరు, జనవరి 18 : జహంగీర్ పీర్ దర్గా అభివృద్ధికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని మాజీ ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ అన్నారు. ఉర్సు చివరి రోజు మహమూద్ అలీ, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ మసియుల్లాఖాన్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. దర్గా అభివృద్ధికి గతంలో 50 ఏండ్లు, ప్రస్తుతం 13 నెలలు ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఏమాత్రమూ కృషి చేయలేదని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు దర్గాలో ఏ మాత్రం అభివృద్ధి జరుగలేదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత దర్గాను బీఆర్ఎస్ ప్రభుత్వ ఆధ్వర్యంలో ఎంతో అభివృద్ధి చేశామని తెలిపారు. దర్గా అభివృద్ధికి మాజీ సీఎం కేసీఆర్ రూ.50 కోట్లు కేటాయించారని చెప్పారు. జేపీ దర్గాను సందర్శించిన ఏకైక సీఎం కేసీఆర్ అని చెప్పారు. వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ మసియుల్లాఖాన్, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ దర్గా అభివృద్ధికి ఎంతో కృషి చేశారని చెప్పారు.

వక్ఫ్ బోర్డు ఖాతాలోనే రూ. 50 కోట్లు

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే దర్గా అభివృద్ధి కోసం కేటాయించిన రూ. 50 కోట్లు వక్ఫ్ బోర్డు ఖాతాలోనే ఉన్నాయిని వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ మసియుల్లా ఖాన్ తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి చేతనైతే ఆ డబ్బులతో దర్గా మాస్టర్ ప్లాన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. దర్గా అభివృద్ధికి తమ సహకారం ఉంటుందని పేర్కొన్నారు.

చిరు వ్యాపారులకు నష్టం రావద్దనే మాస్టర్ ప్లాన్ ఆలస్యం

దర్గా అభివృద్ధికి అప్పటి సీఎం కేసీఆర్ రూ.50 కోట్లు కేటాయించారని మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ తెలిపారు. చిరు వ్యాపారులకు నష్టం జరుగకుండా ఉండేందుకు మాస్టర్ ప్లాన్ అమలు ఆలస్యమైందన్నారు. అందుకోసం దర్గా చుట్టుపక్కల ప్రభుత్వ స్థలాలను గుర్తించి దర్గా అభివృద్ధికి మరొక ప్లాన్ అమలు చేయాలని యోచించామన్నారు. ముఖ్యంగా చెరువు కట్ట అభివృద్ధి తదితర పనులు చేపట్టామన్నారు. ఈలోపే ఎన్నికలు వచ్చాయన్నారు. దర్గాలో రోడ్లు బీఆర్ఎస్ హయాంలోనే వేశామని చెప్పారు. అలాగే దర్గాకు మిషన్ భగీరథ నీరు తెచ్చిందితామే అని చెప్పారు. దర్గాలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కూడా తమ హయాంలోనే పూర్తి చేశామని చెప్పారు. ఇప్పుడున్న కాంగ్రెస్ పార్టీ ఏం చేసిందో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

అనంతరం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎమ్మె సత్యనారాయణ, రాంపాల్ నాయక్ మాట్లాడుతూ.. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విడుదలైన నిధులతో కాంగ్రెస్ ప్రభుత్వం పనులు చేపడుతున్నదని చెప్పారు. అదనంగా ఒక్క కొత్త పని ఏమైనా తెచ్చారా వారు ప్రశ్నించారు. అందుకోసం తాము బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నారాయణరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, దేవేందర్‌యాదవ్, యాదగిరి, మాజీ సర్పంచ్‌లు మిట్టూనాయక్, అజయ్‌నాయక్, సత్తయ్య, శ్రీరాములు యాదవ్, లక్ష్మణ్‌నాయక్, శ్రీశైలం, గోపాల్‌నాయక్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ సెమినార్‌కు డాక్టర్ సామ రవీందర్‌రెడ్డి

షాద్‌నగర్‌టౌన్, జనవరి 18 : సస్టైనబుల్ ఇండియా భాగస్వామ్యంతో సింగపూర్‌లోని సింగపూర్ యూనివర్సిటీ ఆఫ్ సోషల్ సైన్సెస్‌లో ఫిబ్రవరి మొదటి వారంలో నిర్వహించనున్న అంతర్జాతీయ సెమినార్‌కు ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సామ రవీందర్‌రెడ్డి ఎంపికయ్యారు. సెమినార్ ప్రజెంటేషన్‌కు సంబంధించిన ఆహ్వానం రావడం జరిగిందని ఆయన శనివారం తెలిపారు. మన దేశం ప్రస్తుతం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య వాతావరణంలోని మార్పులని, ప్రధాన నగరాల్లో వాతావరణ మార్పులను ఎదుర్కొని ఎలా అభివృద్ధి జరపవచ్చు అనే అంశంపై ఆయా నగరాల నిర్మాణం ఎలాంటి ప్రణాళిక ఉండాలనే విషయంపై పేపర్ ప్రజెంటేషన్ చేయబోతున్నట్లు తెలిపారు. అంతర్జాతీ సెమినార్‌కు ఎంపికైన డాక్టర్ సామ రవీందర్‌రెడ్డిని ప్రొఫెసర్ హరగోపాల్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, పర్యావరణవేత్త ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ సురేందర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు ప్రత్యేకంగా అభినందించారు. ఫరూఖ్‌నగర్ మండలం మొగలిగిద్ద గ్రామంలో నిరుపేద కుటుంబలో జన్మించి ప్రభుత్వ విద్యాలయాల్లో విద్యను కొనసాగించి స్కూల్ అసిస్టెంట్, జూనియర్ లెక్చరర్, డిగ్రీ కళాశాల లెక్చరర్‌గా క్రమక్రమంగా ఎదుగుతూ కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి అర్థశాస్త్రంలో పీజీ, మహిళా సాధికారిత, మహిళ సంఘాలపై పీహెచ్‌డీ, ఆంధ్ర యూనివర్సిటీ నుంచి ఎంఈడీ పొందిన డాక్టర్ సామ రవీందర్‌రెడ్డి గత ఎనిమిది సంవత్సరాలు షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్నో సేవలు అందించి ఇటీవలే రాజేంద్రనగర్‌కు బదిలీపై వెళ్లడం అభినందనీయమన్నారు.

డాక్టర్ సామ రవీందర్‌రెడ్డిని అభినందిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

మున్సిపల్ అధికారులు తమ ఇంటిని కూల్చేందుకు యత్నిస్తుండటంతో ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నిస్తున్న మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రవి, ఆయన సోదరుడు

ఆధారాలు చూపించినా పట్టించుకోరా..?

ఆత్మహత్యాయత్నం చేసిన మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రవి

ఇబ్రహీంపట్నంరూరల్, జనవరి 18 : రాజకీయ కక్షతోనే తమ ఇంటిని కూల్చివేసేందుకు కుట్ర చేస్తున్నారని మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రవి అన్నారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని అంబేద్కర్ చౌరస్తాలోని మంచాల రోడ్డులోగల తాము సొంత ఇంటిని నిర్మించుకుంటుంటే కొందరు ఓర్వలేక తనపై రాజకీయ కక్షతో పలువురు కాంగ్రెస్ నాయకులు అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు పలుమార్లు ఫిర్యాదు చేసినట్లు తెలిసిందన్నారు. అందులో భాగంగానే తమ ఇంటి నిర్మాణాన్ని కూల్చివేసేందుకు శుక్రవారం ఇబ్రహీంపట్నం మున్సిపల్ అధికారులు తమకు నోటీసులు జారీచేశారన్నారు. శనివారం మధ్యాహ్నం తమ ఇంటిని కూల్చేందుకు మున్సిపల్ అధికారులు జేసీబీతో తమ ఇంటివద్దకు వచ్చారని, దీంతో తమ ఇంటికి సంబంధించిన పూర్తి పత్రాలు ఆధారాలతో చూపించినప్పటికీ అధికారులు పట్టించుకోకుండా కూల్చేందుకు యత్నించారు. దీంతో రవితో పాటు అతడి సోదరుడు తమ ఇంటివద్దకు వస్తే ఆత్మహత్య చేసుకుంటామని ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశారు. దీంతో చేసేదేమీలేక మున్సిపల్ అధికారులు వెనుతిరిగారు. ఇది ముమ్మాటికి రాజకీయ కక్ష సాధింపు చర్య అని.. తమకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

భూములను జాగ్రత్తగా గుర్తించండి

ఆమనగల్లు, జనవరి 18 : సాగుకు ఆమోదయోగ్యం కాని భూములను జాగ్రత్తగా గుర్తించాలని జిల్లా వ్యవసాయ అధికారి నరసింహారావు అధికారులకు సూచించారు. శనివారం మండల కేంద్రంలో జరుగుతున్న రైతు భరోసా భూముల క్షేత్రస్థాయి వెరిఫికేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. సాగుకు ఆమోదయోగ్యంగా ఉన్న భూమికి ఎకరాకు రూ.12 వేలు పెట్టుబడి సాయం ప్రభుత్వం అందజేస్తుందన్నారు. వ్యవసాయానికి యోగ్యత లేని భూములకు రైతు భరోసా పథకం వర్తించదన్నారు. తదనంతరం రైతు వేదిక భవనంలో విలేజ్ మ్యాప్, శాటిలైట్ మ్యాప్‌లను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లలిత, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌గౌడ్, ఆర్ఐలు చెన్నకేశవులు, సంపత్, సర్వేయర్ రవి, ఏఈవో నిఖిత పాల్గొన్నారు.

మాదాపూర్‌లోని అన్నమాచార్య భావనా వాహినిలో శనివారం పద్మశ్రీ, డాక్టర్ శోభరాజు ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. నిత్యశ్రీ, డాన్స్ అకాడమీ నృత్య గురువు రజిత శేఖర్ శిష్యబృందం ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణం, మహాగణపతి వంటి సంకీర్తనలకు కూచిపూడి నృత్యప్రదర్శనలు చేసి అలరించారు. - మాదాపూర్, జనవరి 18

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

మత్తు పదార్థాల నిర్మూలనను బాధ్యతగా తీసుకోవాలి

జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, జనవరి 18 : మత్తు పదార్థాల నిర్మూలనకై ప్రతిఒక్కరూ బాధ్యత తీసుకొని సమాజానికి తోడ్పడాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఎక్సైజ్, విద్యా శాఖ, జిల్లా సంక్షేమ, వ్యవసాయ, పోలీస్, వివిధ శాఖల అధికారులతో మాదకద్రవ్య నిర్మూలనపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాలు తీసుకోవడం వల్ల జరిగే అనర్థాలను ప్రజలకు ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. ముఖ్యంగా విద్యాసంస్థలు, వసతి గృహాల్లో మాదక ద్రవ్యాల వాడకం వల్ల జరిగే దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో పర్యటించే క్రమంలో మహిళా స్వయం సంఘాలు, అంగన్‌వాడీ టీచర్లు, స్వచ్ఛంద సంస్థలు మాదకద్రవ్యాల వాడకం వల్ల జరిగే నష్టాలపై అవగాహన చేపట్టాలన్నారు. మత్తు పదార్థాల నివారణలో భాగంగా వ్యవసాయ పొలాల్లో గంజాయి పండించడంపై దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. జిల్లాలో పూర్తిగా మత్తు పదార్థాలను నిర్మూలించేందుకు అన్ని శాఖల సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. ముఖ్యంగా రైలు, రోడ్డు మార్గాల్లో గంజాయి విక్రయదారులు వచ్చే అవకాశం ఉన్నందున.. వారిని అడ్డుకునేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం ఎల్లవేళలా అప్రమత్తంగా ఉంటూ ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహించాలని ఆయన సూచించారు.

సమావేశంలో అదనపు ఎస్పీ హనుమంతరెడ్డి, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంటఖ శ్రీనివాస్‌రెడ్డి, డీఈవో రేణుకాదేవి, డీఎంహెచ్‌వో వెంకటరమణ, డీసీహెచ్‌వో ప్రదీప్, డీఎస్‌వో హనుమంతరావు, ఇంటర్మీడియట్ జిల్లా అధికారి శంకర్‌నాయక్, అటవీ శాఖ రేంజ్ ఆఫీసర్ శ్యాంకుమార్ పాల్గొన్నారు.

పరిగి పోలీస్‌స్టేషన్ తనిఖీ

పరిగి పోలీస్‌స్టేషన్ ఆవరణలో పోలీసుల వందనం స్వీకరిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

పరిగి, జనవరి 18 : పరిగి పోలీస్‌స్టేషన్‌ను శనివారం ఎస్పీ నారాయణరెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పలు రికార్డులు పరిశీలించడంతోపాటు పరిగి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులు, ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. సీసీ కెమెరాలను పెంచడం ద్వారా నిఘా వ్యవస్థను మరింత పటిష్టవంతం చేయవచ్చని సూచించారు. నేరాల నివారణకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఎస్పీ పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, పరిగి ఎస్ఐ సంతోశ్‌కుమార్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, హాజరైన రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్వాసితులు

రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి సహకరించాలి

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

వికారాబాద్, జనవరి 18 : రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి అందరూ సహకరించాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. శనివారం వికారాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హైదరాబాద్ రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్వాసితులు, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాసితులతో మాట్లాడుతూ.. బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా ఇండ్లు, స్థలాలు కోల్పోతున్న నిర్వాసితులకు ఎలాంటి నష్టం జరగకుండా పరిహారాన్ని అందించి న్యాయం చేకూరుస్తానన్నారు. ప్రజాప్రయోజనాల దృష్ట్యా ప్రజలకు ఉపయోగపడే రైల్వే బ్రిడ్జి నిర్మాణం జరగాలని, లక్షలాది మంది ప్రజలకు ఉపయోగపడే ఇలాంటి కార్యక్రమాలకు అందరూ సహకరించాలని ఆయన కోరారు. నిర్వాసితులు చేస్తున్న త్యాగానికి వెలకట్టలేమని, మీ బాధను అర్థం చేసుకుని మీకు అన్ని విధాలుగా న్యాయం చేయాలనే ఉద్దేశంతో ఈ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రజల అభిప్రాయం మేరకే క్షేత్రస్థాయిలో పరిశీలించి స్థల సేకరణ చేపడతామని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుధాకర్‌రెడ్డి, వికారాబాద్ ఆర్డీవో వాసుచంద్ర, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఎర్రమట్టిని తరలిస్తున్న వాహనాలను సీజ్ చేసిన పోలీసులు

వాహనాలు సీజ్

వికారాబాద్, జనవరి 18 : అక్రమంగా ఇసుక, ఎర్రమట్టి రవాణా చేస్తున్న వారిపై జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారుల దాడులు చేసినట్లు ఎస్పీ నారాయణరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వికారాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ధన్నారంగుట్ట నుంచి ఎర్రమట్టిని తరలిస్తున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి మూడు ఎర్రమట్టి లోడ్ చేసిన టిప్పర్ వాహనాలు, ఒక జేసీబీ, ఒక కారు, 4 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై వికారాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తాండూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక ట్రాక్టర్, యాలాల పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు ట్రాక్టర్లలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండగా టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకొని ముగ్గురిని అదుపులోకి తీసుకొని ఆయా పోలీస్‌స్టేషన్స్ పరిధుల్లో కేసు నమోదు చేయించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో పీడీఎస్ బియ్యం, ఇసుక, ఎర్రమట్టి, మొరం అక్రమ రవాణాలు చేసినా, చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. వారు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని, జిల్లాలో ఎవరైనా చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, అక్రమంగా రవాణా జరిపినా జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి ఆంజనేయులు సెల్ నం.8712670022కు సమాచారం అందించాలని ఎస్పీ తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా కృషి

వికారాబాద్, జనవరి 18 : అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా అధికారులు కృషి చేయాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. శనివారం రైతు భరోసా, ఇందిరమ్మ ఇల్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల అందజేతపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ జూమ్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు అర్హులైనవారికి అందేలా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇల్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల పరిశీలన ప్రక్రియను పూర్తిచేసి ఆదివారం మధ్యాహ్నం లోపు నివేదికలు రూపొందించాలని కలెక్టర్ సూచించారు. సాగు వినియోగంలో లేని భూములు, ఫామ్ హౌస్, రిసార్ట్‌లలో నిర్మాణాలు చేపట్టిన భూములను కూడా గుర్తించి నివేదికలు రూపొందించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, డీపీవో జయసుధ, డీసీహెచ్‌వో మోహన్‌బాబు, వ్యవసాయ శాఖ ఏడీఏ స్వరూపరాణి, హౌసింగ్ పీడీ కృష్ణయ్య, ఆర్డీవో వాసుచంద్ర పాల్గొన్నారు.